

# ఇదేంటి సంగతి!

- ప్రజ్వల

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఎంతో అసహనంగా అటు ఇటు తిరుగుతున్నాడు శేఖర్. వెధవది బాంబే నుంచి రావలసిన ఎయిర్‌బస్ రెండు గంటలు లేటు. శ్రావణమాసం మొదలయింది. బయట వర్షం లోపల ఏ.సి. చలి ఒకవిధంగా విసుగును ఎక్కువ చేస్తున్నాయి. వచ్చేవారం తన ఫస్ట్ వెడ్డింగ్ డే. ఆషాఢ మాసం సాకుతో తన వీణను వాళ్ళ పుట్టిల్లు బాంబేకి తీసుకెళ్ళారు ఆమె తల్లిదండ్రులు. అసలు ఏమిటో ఈ మనుషులు ఎంత చదువుకుని పట్టణాలలో ఉన్న ఇంకా ఈ పాత సాంప్రదాయాలు వదలలేరు.

ఆమధ్య ఒక పుస్తకంలో చదివాడు శేఖర్. ఆషాఢ మాసంలో భార్యాభర్తలు కలిసి ఉండే పది నెలల తర్వాత పుట్టే బిడ్డ మండు వేసవి కాలంలో పుడుతుంది. కాబట్టి కొత్తగా పెళ్ళయిన దంపతులను విడదీస్తారు. కానీ తనకు పెళ్ళయిందే శ్రావణంలో. దాదాపు ఏడాది కాపురం చేశాక ఇప్పుడు ఆషాఢ మాసం అంటూ నెల రోజులు తన వీణని దూరం చేశారు. ఆమె లేని ఈ నెల ఎలా గడిపాడో?

ఆఖరి అనౌన్స్‌మెంటు విని ఆశగా ఆకాశం వంక చూశాడు శేఖర్. దిగుతున్న విమానంలో తన హృదయ వీణ ఉందని తెలిసిన శేఖర్‌కు అంతసేపు వున్న కోపం అసహనం పోయి ఆ విమానం మీద ప్రేమ పెరిగింది. విమానం ఆగటం ప్రయాణీకులు దిగటం అంతా యాంత్రికంగా జరిగిపోతున్నది.

ఆప్యాయంగా నవ్వుతూ తనవైపు వస్తున్న వీణ వెనకాల ఒక చిరపరిచితమైన ముఖం... షాక్ తిన్నాడు. ఆ ఆకర్షణీయమైన ముఖాన్ని తను ఎలా మర్చిపోగలడు. ఆమె సితార. కానీ ఆమెతో మాట్లాడే ధైర్యం లేదు తనకు. అందులోనూ తన భార్య వీణ ముందు. సితార అటువైపు తిరిగి వేరే ఎవరితోనే చాలా సీరియస్‌గా మాట్లాడుతూ తన లగేజ్ కోసం వెయిట్ చేస్తోంది..

"చాల్లెండి చూసింది... ఓ నెల రోజులు భార్య కూడా లేకపోతే చాలు ఈ మగాళ్ళకి" భార్య వీణ మందలింపుతో ఆముదం తాగిన ముఖంతో సితార మీదినుంచి చూపులు మరల్చుకున్నాడు. ఆమెకు దొరికిపోయిన శేఖర్.

కార్లో ఇంటికి బయలుదేరారు వీణ, శేఖర్. దారిలో తన అత్త మామల గురించి హైదరాబాదు స్నేహితుల గురించి ఎన్నో కుశల ప్రశ్నలు వేస్తున్నది వీణ. అన్నిటికీ యాంత్రికంగా జవాబు చెబుతున్నాడు శేఖర్. కారు ముందుకు పోతున్నది. కానీ అతని జ్ఞాపకాలు రెండు సంవత్సరాలు వెనక్కి వెళ్లాయి.

• • • • •

"మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అంటూ ఆమె చేతిలో ఓ చిన్న గిఫ్ట్ పేకెట్ పెట్టాడు శేఖర్.

"ఓ థ్యాంక్యూ ఇదేమిటో ఇప్పుడే తెరిచి చూడొచ్చా?" అంటూ సమాధానం కోసం కూడా ఎదురుచూడకుండా గబగబా ఆ పేకెట్టును విప్పటం మొదలుపెట్టింది సితార.

ఆమెవంకే రెప్ప అర్పకుండా చూస్తున్నాడు శేఖర్.

"ఓ ఫెంటిస్టిక్ పెండెంట్. అందులోనూ ఆర్టీన్ షేప్. ప్రేమచిహ్నం. శేఖర్ నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

రెండు రోజులుగా ఇదే ప్రశ్న ఆమెనడగాలని ఎన్నో కోణాలలో ఎన్నోవిధాల ప్రశ్నలూ సమాధానాలు రిహార్సల్స్ చేశాడు. కానీ ఆ ప్రశ్న సూటిగా తననే అడిగేటప్పటికి ఏం సమాధానం చెప్పాలో తెలీక తెల్లమొఖం వేశాడు శేఖర్.

"ఏంటా వెర్రిచూపులు. బెల్లం కొట్టిన రాయి లాగా?" కవ్వించింది సితార.

"పోనీలే రెండు రోజులు టైం ఇస్తున్నాను ఆలోచించి సమాధానం ఇవ్వు."

శేఖర్‌కు మళ్ళీ మౌనమే సమాధానం అయింది. ఇంతలో సర్వర్ రాకతో సితార సంభాషణ వేరే మలుపు తిరిగింది.

• • • • •

సితార తండ్రి బొంబాయిలో ఓ బిజినెస్ మాగ్నెట్. ఆమె తల్లి ఓ మహారాష్ట్ర వనిత. కాస్మాపాలిటన్ జీవితం వల్ల అందరితోనూ ఆడా మగా బేధం పాటించక చనువుగా ఉంటుంది సితార. బొంబాయిలో ఉండటం వల్ల ఏదో తెలుగు మాట్లాడటమే గాని చదవటం, రాయటం రాదు. శేఖర్ పనిచేసే అడ్వర్‌టైజింగ్ కంపెనీలో సితార కూడా పనిచేస్తున్నది. ఆమె ఉద్యోగం చెయ్యటం డబ్బు సంపాదన కన్నా ముఖ్యంగా టైంపాస్‌కనే చెప్పాలి.

శేఖర్‌కు సితారలో ఇది అని నిర్ధారణ చెయ్యలేని ఓ ఆకర్షణ కల్గింది. ఆ ఆకర్షణని స్నేహందాకా లాక్కొచ్చాడు. ఇక ఈ స్నేహాన్ని పెళ్ళిగా మార్చాలంటే చాలా ప్రాక్టికల్ చిక్కులు కనిపిస్తున్నాయి.

ముఖ్యంగా శేఖర్ గోదావరి జిల్లా కోనసీమలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. సాంప్రదాయమైన తల్లిదండ్రులు. చదువుకొని పాసవటం తప్ప జీవితంలో గొప్పగా అతడు చేసిన సాహసాలో, సాధించిన విజయాలో ఏమీ లేవు. తన తండ్రి ఓ హైస్కూలు తెలుగు మాస్టారు. సితారకి తెలుగు చదవటం, రాయటం రాదు. మాటలు కూడా అంతంత మాత్రమే. ఈ విషయం తెలిస్తే తన తల్లిదండ్రులు ససేమిరా ఒప్పుకోరు.

ఇక సితారకి ఆడామగా బేధం లేదు. అందరితో కలిసిపోతుంది. తమ కంపెనీలో దాదాపు పదిమంది ఆడవారు ఇరవైమంది మగవాళ్ళు పనిచేస్తున్నారు. ఆ ఇరవైమందితోనూ ఒకే విధంగా మసలుకుంటుంది సితార. అదేం విచిత్రమో గానీ ఆమె తనతో మాట్లాడుతున్నంతసేపూ మనసుకు హాయిగా వుండి అందరు ఆడవాళ్ళూ ఇలా సోషల్‌గా ఉండాలనిపిస్తుంది. కానీ సితార ఇంకెవరినైనా చూసి "హాయ్ హలో" అంటే మాత్రం తన గుండె ఎందుకో విలవిలలాడిపోతుంది. దాన్ని తను సహించలేడు. ఆమె మారదు.

అన్నిటికన్నా క్లిష్టమైనది ఆమె, పెళ్ళి తర్వాత కూడా ఉద్యోగం చేస్తానని నిర్మొహమాటంగా చెప్పటం. దీనికి సుతరామూ తన తల్లిదండ్రులు ఒప్పుకోరు. అదీకాక తన తల్లిదండ్రులది, తనది అతి సున్నితమైన మనస్థత్వం. కానీ సితార ముక్కుకు సూటిగా పోయి నిర్మొహమాటంగా వ్యవహరించే ఘటం. తనకు నచ్చిన పనిచేసి తీరుతుంది. నచ్చని పని ససేమిరా చెయ్యదు. ముఖ్యంగా ఒక్క కూతురే గనక గారాబంతో ప్రేమనే ఎక్కువ నేర్పారు గానీ, పెద్దలను గౌరవించడం, సర్దుకుపోవడం అన్నది నేర్పలేదు ఆమె తల్లిదండ్రులు.

ఇన్ని వంకరటింకర్లతో ఆమెను పెళ్ళి చేసుకుని తనేం సుఖపడతాడు. పెళ్ళి తర్వాతన్నా జీవితంలో తన తల్లిదండ్రులను సుఖపెట్టాలనుకున్నా తన కలలేం కావాలి? ఆలోచిస్తున్నాడు శేఖర్. కానీ సితార మీది ఆకర్షణ మాత్రం తగ్గలేదు. అందుకే ఆమె ఇచ్చిన గడువు తీరేదాకా జ్వరం సాకుతో ఆఫీసుకు లీవు వేశాడు.

నాలుగో రోజు ఆఫీసుకు వెళ్ళిన తనకు తెలిసిన విషయం ఏమంటే సితార అమెరికాలో ఎం.బి.ఏ., చదవటానికి వెళ్ళిందని. శేఖర్ ఒక విధంగా నిరాశ చెందినా ఏదో పెద్ద భారం తగ్గినట్లు ఫీలయ్యాడు. కానీ మళ్ళీ ఇవ్వాళ ఎయిర్‌పోర్ట్‌లో సితారను చూసినప్పుడు ఏదేదో మాట్లాడాలనుకున్నా, తన భార్య ఉండటం వల్ల ఏమీ మాట్లాడలేకపోయాడు. ముఖ్యంగా ఆమెకు తనిచ్చిన లాకెట్ ఇంకా వేసుకుందా అన్నది చూడాలన్న కుతూహలం అతనిలో ఉండిపోయింది.

• • • • •

రాత్రి గంట తొమ్మిదయింది. భోంచేసి తన గదిలో వీణ కోసం ఎదురుచూస్తున్నాడు శేఖర్. ఎంతకూ రాదు. రేపు తన తల్లిదండ్రులు కాజీపేటకి పెళ్ళికెళ్ళాలని వారికన్నీ సిద్ధం చేస్తున్నది. వీణదొక విధమైన మనస్థత్వం. అంతా మిలటరీ డిసిప్లిన్. అన్ని పనులూ తనే చెయ్యాలి. "మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్" అంటారు. కానీ "వీణ శేఖర్ల మేరేజ్ మేడిన్ ట్రైన్."

దాదాపు రెండు సంవత్సరాల క్రితం శేఖర్ తన తల్లిదండ్రులతో బాంబే నుండి హైదరాబాదుకు ట్రాన్స్‌ఫర్ మీద ఫస్ట్‌క్లాసులో ప్రయాణం చేస్తున్నాడు. అదే బోగీలో ఒంటరిగా ప్రయాణం చేస్తున్న వీణ పరిచయం అయింది.

ముందుగా తన తల్లితో మాటలు కలిపింది. వాళ్ళ నాన్న బొంబాయిలో పెద్ద మిలిటరీ ఆఫీసరట. చాలారోజులు నార్త్ ఇండియాలో ఉండి అక్కడే చదువుకుందిట. హైదరాబాద్‌లో స్నేహితురాలి పెళ్ళికి వెళుతున్నానని చెప్పింది.

దానికి శేఖర్ తల్లి "మరి నీ పెళ్ళెప్పుడమ్మా" అని అడిగింది.

"మీలాంటి మంచి అత్తగారూ మామగారు దొరికిన రోజు" అని చమత్కారంగా అంది. అంతే ఆమె తనకు కాబోయే కోడలన్న ఆలోచనా బీజం వారి మనస్సులో నాటుకుంది. దారిపొడుగునా తన తల్లిదండ్రులకు ఆపిల్స్, ఆరంజీ ఇలా ఏదో ఒక పళ్ళు కొని తినిపిస్తూనే వచ్చింది.

ఆశ్చర్యం ఏమిటంటే సితారలో ఉన్న అన్ని లోపాలూ ఈ వీణలో కూడా వున్నాయి. కానీ ఆ లోపాలు తనకే కనిపించాయి కానీ తన తల్లిదండ్రులకు కొంచెం కూడా కనపడలా.

వీణకు కూడా తెలుగు రాయటం, చదవటం రాదు. కానీ ఆమె రాసి చూపిన కొక్కిరిపిక్కిరి "అ ఆ ఇ ఈ" అనే నాలుగు అక్షరాలు చూసి మురిసిపోయారు తన తల్లిదండ్రులు. వీణ తల్లి ఉడిపి కన్నడపు వనిత. "ఉడిపివాళ్ళు బాగా వంట చేస్తారుగా మన ఆంధ్రాలో మంచి మంచి హొటళ్ళన్నీ వాళ్ళవే" తన తల్లి సమర్థించింది.

వీణ కూడా పెళ్ళి తర్వాత ఉద్యోగం చేయాలని చెప్పింది. "అబ్బే నువ్వు కూడా ఎందుకమ్మా ఉద్యోగానికి వెళ్ళటం" అన్న తల్లిని, "అయితే నాకు ఇప్పుడు దాదాపు మూడువేల రూపాయలు జీతం వస్తున్నది. నెలకి మీ అబ్బాయిని నాకు మూడువేల రూపాయలు పాకెట్ మనీ ఇవ్వమని చెప్పండి. నా ఉద్యోగం మానుకుంటాను. నేసంపాదించేదంతా మీ మనవడికీ, మనమరాలి కోసమే గదండీ" అని వాళ్ళని భవిష్యత్తులోకి తీసుకెళ్ళి తాత నానమ్మలని చేసి ఆనందపరిచింది వీణ.

పిల్ల నచ్చింది. బొంబాయిలో పెళ్ళి నిశ్చయం అయింది. ఇందులో శేఖర్‌కి కొట్టొచ్చినట్లు కనపడిందేవిటంటే వీణ పెళ్ళికి ఆమె స్నేహితురాళ్ళ కన్నా స్నేహితులే అంటే బాయ్‌ఫ్రెండ్‌లే ఎక్కువగా వచ్చారు. ఆ బాయ్‌ఫ్రెండ్లు తెచ్చిన ప్రెజంటేషన్‌ల ముందు ఇదేం విపరీతంగా కనబడలేదు అతని తల్లిదండ్రులకు.

ఫస్ట్‌నైట్‌లో శేఖర్ వీణను అడిగాడు, "ఇవాళ వచ్చిన మీ మిత్రులలో పెళ్ళికి ముందు నీకు ఎవరితోనైనా అతి చేరువుగా స్నేహం ఉండేదా?" ఈ ప్రశ్న వేసిన తర్వాత ఎందుకు వేశానా అని చాలా ఫీల్ అయ్యాడు శేఖర్. తన మధ్యతరగతి మనస్థత్వాన్ని అద్దం పట్టి చూపాడు.

"ఓ, యూ మీన్ అఫైర్ - హౌ మీన్ యు ఆర్. అవును ఇవాళ వచ్చిన అందరి బాయ్‌ఫ్రెండ్స్‌తోనూ ఉంది చాలా" సీరియస్‌గా అన్నా, నవ్వుతూనే అంది వీణ.

"అన్నట్లు పెళ్ళికి ముందు తమకేమైనా అఫైర్స్ ఉన్నాయా ఉంటే ఇప్పుడే ధైర్యంగా చెప్పేయ్యండి చెల్లుకి చెల్లు సరిపోతుంది" అదే చిరునవ్వు. కానీ కుక్క కాటుకు చెప్పుదెబ్బలాగా ఉన్నాయి ఆ మాటలు.

## అజీర్ణానికి సంప్రదాయ చికిత్స!

**అజీర్ణం**

సకల రోగాలకూ అజీర్ణమే మూలమని ఆయుర్వేదం తెలుపుతోంది. అజీర్ణ రోగం వున్న వారికి శరీరంలో శక్తిలేమి, ఆకలి లేక పోవడం, వంటివి సహజంగానే వుంటాయి. మానసికంగా భయం, నరాల దౌర్బల్యం, చురుకుతనం లేక పోవడమూ కలుగుతాయి. అంటే శరీర అస్వస్థత మానసికంగా కూడా బాధిస్తుంది. శరీరం అజీర్ణంతో బాధపడడం వలన జీర్ణకోశం చురుకుగా వుండదు.

శరీర మాంద్యత మనసుపై తన ప్రభావాన్ని చూపడం వలన కామ, క్రోధ, భయం లాంటి భావోద్రేకాలూ కలుగుతాయి. వీటి వలన సేవించే ఆహారం జీర్ణం కాక మరిన్ని సమస్యలకు కారణమవుతుంది. అందువలన మనం సేవించే ఆహారం శరీర పుష్టికే కాక మానసిక ఆరోగ్య దృష్ట్యా కూడా బలవర్ధకమై వుండాలి.

**అజీర్ణానికి చికిత్స:**

1) ప్రతి రోజూ మనం తీసుకునే ఆహారంలో అల్లం చేర్చుకోవడం ఎంతైనా అవసరం.

2) ఒక చమ్చాడు అల్లపు రసాన్ని ఒక చమ్చా నిమ్మరసాన్ని ఒక బాటిల్ సోడాతో కలిపి త్రాగాలి. అవసరమైతే ఉప్పు లేదా పంచదార చేర్చుకోవచ్చు.

3) కాల్చిన ఉల్లిపాయ, లేదా వెల్లుల్లిని తినచ్చు.

4) ముల్లంగిని సన్న చక్రాలుగా తరిగి, వాటిని మిరియాల పొడి, నిమ్మరసం, ఉప్పులో అద్దుకుని సేవించడం మంచిది.

5) ప్రతి రోజు రాత్రి పడుకునే ముందు బాగా పండిన ఒక అరటి పండును ఏలక్కాయతో (పై తొక్క తీయకుండా) సేవించడం మంచిది.

**మలబద్ధతకు చికిత్స:**

1) రాత్రి పడుకునే ముందు ఒక అరటి పండు లేదా ఒక ముక్క బొప్పాయ పండు తినాలి.

2) ఒక గ్లాసు సొరకాయ రసానికి కొంత ఉప్పు చేర్చి రోజుకొక మారు సేవించాలి. ఇలా కొంత కాలం చేయడం వలన ఎన్నో ఏళ్లుగా మలబద్ధకంతో బాధపడుతున్న వారికి గుణం కనబడుతుంది.

3) బొప్పాయ పండు ముక్కలను జీలకర్ర పొడి మిరయాల పొడి, నిమ్మరసం, ఉప్పుతో అద్ది ప్రతి రోజూ సేవించడం వలన మలబద్దత నివారణ అవుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. కడుపులోని క్రిమికీటకాలు నశిస్తాయి.

**కడుపు నొప్పి:**

వాత దోషం, అజీర్ణం, మరి ఇతర కారణాల వలన కడుపు నొప్పి కలుగుతుంది. అందువలన వాత నాశనానికీ, జీర్ణ శక్తికీ మందు తీసుకోవాలి.

1) భోంచేసిన తరువాత రాత్రి పడుకునే ముందు, ఒక గ్లాసు పాలల్లో కొద్దిగా బెల్లం కలిపి త్రాగాలి. ఇలా వరుసగా ఎనిమిది రోజులు చేయాలి.

2) కడుపు నొప్పితో బాధ పడుతున్న వారికి సేవించడానికి తేనె నివ్వాలి. తక్కువ పరిమాణం వలన నొప్పి తగ్గకపోతే మరి కాస్త తేనెను త్రాగనివ్వాలి.

3) ఉసిరిక రసంలో, చక్కెర వేసి త్రాగనివ్వాలి.

4) వేడి నీటిలో మెంతులు, సగ్గుబియ్యం వేసి త్రాగనివ్వాలి.

5) ధనియాలు, శొంఠి కలిపిన కషాయాన్ని త్రాగితే కడుపు నొప్పి మటుమాయం అవుతుంది.

6) లేత జామ ఆకులను అల్లం, ఉప్పు చేర్చి నూరి తినాలి. ఎంత కఠినమైన కడుపు నొప్పైనా తగ్గిపోతుంది.

-కె. శారద

"అబ్బే అఫైర్సా అలాంటివేం నాకు లేదు" బెదిరిపోయాడు శేఖర్.

అదే మంకుతనం ముక్కుసూటిగా నిర్మొహమాటంగా మాట్లాడటం అంతా సితారే. బహుశ తను సితారను పెళ్ళి చేసుకున్నా తన తల్లిదండ్రులు ఇలాగే ఒప్పుకొని ఉండేవాళ్ళా? సితారను వదుకొని తను తప్పు చేశాడేమో?

బెడ్‌రూం లోపలకు వచ్చిన వీణను చూసి అతని ఆలోచన్లకు అంతరాయం కల్గింది.

• • • • •

మర్నాడు తల్లిదండ్రులను పొద్దునే కాజీపేట బండెక్కించి ఇంటికి వచ్చాడు శేఖర్. ఇంట హాల్లో సితార ఒంటరిగా కూర్చొని వుంది. ఆమె మెళ్ళో ఆఠీన్ లాకెట్ తళుక్కుమంది. శేఖర్ గుండె గుబుక్కుమంది, భార్య కోసం అటు ఇటు దొంగ చూపులు చూశాడు. ఇంతలో లోపలినుండి కాఫీ కప్పుతో హాల్లోకి వచ్చింది వీణ. "అబ్బ వచ్చారా రండి. ఈమె ఎవరో సితారట. మిమ్మల్ని చూడాలని పొద్దున్నించి ఇక్కడ కూర్చొని వుంది. మీతో ఏదో ముఖ్యంగా మాట్లాడాలట" శేఖర్ కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూసి మాట్లాడుతున్నది వీణ.

శేఖర్ నాలుక ఎండిపోయి గొంతు బొంగురు పోయింది. "ఆహా అలాగా నువ్వు వెళ్ళి నాకు కూడా ఓ కప్పు కాఫీ పట్రా" అని కాఫీ సాకుతో వీణను వంటింట్లోకి పంపాడు శేఖర్. ఆమె లోపలి కెళ్ళిన తర్వాత -

"ఏమిటి సితారా ఎందుకిలా వచ్చావ్?"

"అదేమిటి శేఖర్. రెండు సంవత్సరాల తర్వాత నిన్న నన్ను ఎయిర్‌పోర్ట్‌లో చూసీ చూడనట్లు వచ్చేశావ్. ఇన్నాళ్ళూ ఎలా ఉన్నానని ఒక్కమాటైనా అడగలేదు. ఇదేనా నీ స్నేహం. నాతో స్నేహం పెంచుకుని ఇప్పుడీమెను పెళ్ళి చేసుకుని నాకు ద్రోహం చేస్తే ఎలా? నువ్వు ఇచ్చిన లాకెట్ ఇంకా నీ జ్ఞాపకంగా మెళ్ళో వేసుకున్నా చూడు. ఆరోజు నన్ను ప్రేమిస్తున్నావా అన్నది రెండు రోజుల్లో చెబుతాననుకుంటే చెప్పకుండానే దాటేశావు. ఇప్పుడన్నా మౌనం మాని చెప్పు శేఖర్. దయచేసి నన్ను మోసం చెయ్యకు."

"సితారగారూ ఇప్పుడు నాకు పెళ్ళయింది" తెలుగు సినిమాలో హీరోలాగా లాగి డైలాగు చెప్పాడు శేఖర్.

"శేఖర్ ఆ పెళ్ళి ఎవర్నడిగి చేసుకున్నావ్? నీకు ఇష్టం లేకపోతే ఆ రోజే చెప్పి ఉండొచ్చు గదా? అయినా నాలో లేనిది ఆమెలో కొత్తగా ఏం చూశావు?" సున్నితంగా అడుగుతున్నది సితార.

అయోమయంల్లో పడ్డ శేఖర్ భార్య రాకను గమనించి మౌనం వహించాడు.

"ఇదిగోనండి కాఫీ"

కాఫీ తాగే సాకులో మౌనాన్ని పొడిగించాడు శేఖర్. ఇంకా నయం ఈ సమయంలో తన తల్లిదండ్రులు ఇంట్లో లేరు. ఉంటే తన గుట్టు రచ్చకెక్కేది. తన ఇమేజ్ డామేజ్ అయ్యేది. ఈ సితారకు ఏదో నచ్చచెప్పి ముందు బయటికి పంపేయాలి. ఆలోచిస్తూ కాఫీ తాగుతున్నాడు శేఖర్.

"ఇంతకీ ఇప్పుడు ఎవరితో ఉండాలని నిశ్చయించుకున్నారు?" మౌనాన్ని ఛేదిస్తూ ముక్కుసూటిగా అడిగింది విణ.

ఆ మాట విని ఒక్కసారి నోట్లో కాఫీ అమాంతం మింగబోయి కొరమారి దగ్గటం మొదలుపెట్టాడు శేఖర్. అంటే తన తతంగమంతా వంటింట్లో నుంచి విన్నదన్న మాట వీణ. లేకపోతే తను ఇంటికి వచ్చేముందే సితార దగ్గర కూపీ లాగన్నా వుండాలి. తల తిరిగిపోతున్నది శేఖర్‌కి. ఇటు వీణ తను కట్టిన తాళితోనూ అటు సితార తను ఇచ్చిన లాకెట్‌తోనూ మధ్యలో తనూ, సినిమా పోస్టర్‌లాగా తయారయారు. ఇటు వీణ, అటు సితార ఇద్దరూ ఇద్దరే.

ఇన్నాళ్లూ తను దాచిన రహస్యం బయటపడి తన వివాహ జీవితం ఇలా విలవిలలాడుతుందని ఊహించలేదు శేఖర్.

ఇద్దరూ మొండివాళ్ళే. ఇద్దరూ సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే మనస్థత్వం కలవాళ్ళే. ఇప్పుడేదో ఘోర యుద్ధం జరగబోతున్నది. కంపించి పోయాడు శేఖర్. ఇక లాభం లేదు. నిజం చెప్పి తన ఓటమినంగీకరించి వాళ్ళ కాళ్ళ మీద పడాలి సిందేనని నిర్ణయించుకున్నాడు శేఖర్.

"అబ్బ... వీణా... ఇంతకన్నా ఇబ్బంది పెడితే బావగారు బాధపడిపోతారు. అదీగాక నాకు ఆకలి దంచేస్తున్నది. నువ్వు చేస్తున్న పెసరట్టు వాసన ఆదిరిపోతున్నది. ఇక ఆయన్ని ఆటలు పట్టించడం ఆపి ఆ పెసరట్టు అల్లం పచ్చడి వడ్డించవే. ఆకలే బాబూ. ఆఁ... అన్నట్లూ ఈ లాకెట్ నీ మెళ్లో వుంటేనే అందమే అక్కా" అంటూ లాకెట్ తీసి వీణకి ఇచ్చింది సితార.

ఇదంతా వింటూ ఆశ్చర్యంతో తన చెవులని తనే నమ్మలేకపోయాడు శేఖర్.

"అవునండీ ఈ సితార నా కజిన్ సిస్టర్. మన పెళ్ళప్పుడు అమెరికాలో ఎం.బి.ఏ. చదవటానికి వెళ్ళింది. మొన్న బొంబాయిలో కలుసుకుని మాట్లాడుకుంటూంటే దానికి నా భర్త మీరేనని తెలిసింది. అందుకే మీ భరతం పట్టడానికి బాంబే నుంచి ఈ ఊరొ చ్చింది. ఆరోజేమన్నారు. అఫైరే లేదా... మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు... అన్నట్లు సితారకి వచ్చే నెల్లోనే పెళ్లి... మీకిప్పుడు చెప్తేగానీ సెలవు పెట్టరాయె..." చెప్పుకుపోతోంది వీణ.

అవాక్కయి వింటున్నాడు శేఖర్!